
ప్రజాశక్తి
బుధవారం 5 ఫిబ్రవరి 2025
5
పార్వతీపురం మన్యం



స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట : ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన సారథ్యంలో స్కిల్ హబ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం ద్వారా స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణా కోర్సుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ, డిఎస్‌డిఒ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్‌వీలర్ సర్వీస్ అసిస్టెంట్ టెక్నీషియన్, సూయింగ్ మిషన్ ఆపరేటర్ కోసం కనీస విద్యా అర్హత పదో తరగతి ఉండాలన్నారు. ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకో వాల్సిందిగా కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి బయోడేటాతో పాటుగా విద్యా అర్హత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ వివరాలతో స్థానిక ప్రభుత్వ ఐటిఐకి హాజరై దరఖాస్తు చేసుకోవలసినదిగా కోరారు. మరిన్న వివరాలకు 7993795796 నెంబరుకు సంప్రదించాలి కోరారు.

పంతం కోసం ఒకరు... పట్టు కోసం మరొకరు

వాయిదా పడ్డ చైర్మన్ ఎన్నిక ● ఇన్‌ఛార్జి చైర్మన్ పల్లా

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక విషయం ఒక కొలిక్కి రావడం లేదు. పంతం కోసం ప్రతిపక్షం పట్టుబడగా, ప్రతిష్ట కోసం అధికార పార్టీ పాకలాడడంతో ఆఖరుకు చైర్మన్ ఎన్నిక మంగళవారం కూడా వాయిదా పడింది. ఎస్సీ రిజర్వుడ్ కేటాయించిన చైర్మన్ పదవికి వైసిపి తరపున గెలిచిన రెండో వార్డ్ కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరికి వరిస్తుందని అందరూ భావించారు ఈనెల 3న సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నిక జరగ్గా ఇటీవల టిడిపిలో చేరిన మల్లేశ్వరి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించడంతో వైసిపి అందుకు వ్యతిరేకించింది. అప్పటికే పార్టీ నుంచి బి-ఫారం కూడా ఎన్నికల అధికారికి అందాయి. దీంతో కూటమి నేతలకు వైసిపి శ్రేణులకు మధ్య సయోధ్య కుదరలేదు. అధికారంలో తమున్నామని, ఎలాగైనా తమ పార్టీ చైర్మన్‌గా చెప్పుకోవడానికి కూటమి నేతలు ప్రయత్నించారు. తమ పార్టీ నుంచి గెలిచిన వ్యక్తిని అలాగే నగర పంచాయతీలో సంఖ్యాబలం కూడా తమకే ఉన్నందున పట్టు వదలకుండా ఉండేందుకు వైసిపి పట్టు పట్టింది. దీంతో ఇరుపార్టీలు పంతానికి పోవడంతో చైర్మన్ ఎన్నిక జరగలేదు. ఇరు పార్టీ పెద్దల దృష్టి నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికపై పడింది. ఇటు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, అటు ప్రతిపక్షంలో ఉన్న వైసిపి పెద్దలు కూడా దష్టి పెట్టినట్లు తెలుస్తుంది. ఎలాగైనా ఎన్నిక జరిపి చైర్మన్ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని ఇద్దరు మంత్రులు మంగళవారం ఫోన్ ద్వారా ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తుంది. మరో మంత్రి ఏకంగా రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి అనుకున్నది సాధించాలని ప్రయత్నించినట్లు తెలుస్తుంది. అలాగే వైసిపి రాష్ట్ర నాయకులు, విజయనగరం జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నేరుగా వైసిపి కౌన్సిలర్లుతో ఫోన్లో మాట్లాడినట్లు సమాచారం. ఇందులో భాగంగానే మంగళవారం సమావేశానికి వైసిపి కౌన్సిలర్లు ఎవరూ హాజరు కావద్దని చెప్పినట్లు తెలుస్తుంది. వైస్ చైర్మన్-2 పల్లా ప్రతాప్‌ను డిసెంబర్‌లో చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఎన్నికల వాయిదా పడడంతో మళ్లీ ఆయనే కొనసాగనున్నారు.


వైసిపి సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మూడేళ్ల ముచ్చటే

● పెచ్చులూడిన ప్యాచ్ వర్క్‌లు ● రహదారంతా డొల్లే ● అధికారుల నిర్లక్ష్యం ● కాంట్రాక్టుల చేతివాటం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి జంక్షన్ నుంచి శంభాం వరకు రూ.20 లక్షలతో ఆర్ అండ్ బి అధికారులు చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులు కనీసం మూడేళ్ల ముచ్చటైనా తీరలేదు. ఆర్‌అండ్‌బి ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడంతో కాంట్రాక్టురు చేతివాటం ప్రదర్శించడంతో పనులు పూర్తి మూడు వారాలైనా కాకలేదు ఇప్పటికే రోడ్డంతా ఎక్కడికక్కడ రాళ్లు తేలిపోతున్నాయి. కుసిమి జంక్షన్ నుంచి శంభాం వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇండియన్ బ్యాంక్, మూడు ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాల, ప్రతిభా కళాశాల, ప్రాథమిక పాఠశాలలతో పాటు సుమారు 200 గ్రామాల పర్యాటకుల సందర్శించే ఆడలి వ్యూ పాయింట్‌కు ఈ రహదారిపైనే వెళ్లాలి. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉన్న ఈ రహదారి నాణ్యతకు పాతరేసినట్లుగా మరమ్మతులు చేపడితే ఎలా అని గిరిజనులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల మరమ్మతులు చేపట్టి మూడు వారాలు గడవకముందే అప్పుడే పెచ్చులు ఊడిపోవడంతో దారుణమంటున్నారు. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని పెదవులు విరిస్తున్నారు. గతంలో ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులు అందజేశారు. అయితే మంత్రంగా మట్టిని గోకిసి దీనిపై తారు వేసుకొని తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నారు. అంతేకాకుండా తారు చిప్స్ మిషన్‌తో వేయకుండా మనుషులే వేశారని, దీనిపై బుల్డోజర్‌తో రోలింగ్ చేశారని చుట్టుపక్కల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మళ్లీ గ్రామస్తులు ఒక లేయరే వేశారని గ్రామస్తులు సూపర్వైజర్‌కు అడగ్గా మరొక లేయర్ వేస్తామని చెప్పి మూడు వారాలు గడుస్తున్నా ఇంతవరకూ రెండో లేయర్ వేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి కూడా ఎత్తుపల్లాలు లెవిలింగ్ చేయకుండా రహదారి మరమ్మతులు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.


పెచ్చులూడిపోయిన కుసిమి-శంభాం రోడ్డు

మరమ్మతులు సరిగ్గా చేపట్టలేదు

మండలంలోని కుసిమి జంక్షన్ నుంచి శంభాం వరకు మరమ్మతులు సరిగ్గా చేయలేదు. తారు చిప్స్ రోలింగ్ చేసింది మిషన్‌తో వేయకుండా మనుషులతో వేశారు ఇలా అయితే ఎలా అని ఎన్నాళ్లు ఉంటుంది.

సవర చంటిబాబు,
గిరిజనుడు, బంగారు గూడ గ్రామం

రహదారి నాణ్యత లేదు

కుసిమి జంక్షన్ నుంచి శంభాం వరకు ఇటీవల మరమ్మతులు చేపట్టిన రహదారి నాణ్యత లేదు. చిప్స్, తారు మనుషులతో వేశారు. మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో పర్యాటకం, సంత, హాస్పిటల్, విద్యార్థులు, అనేక గ్రామాలు ఉండడంతో ప్రజలు రాకపోకలు రద్దీగా ఉంటాయి. దీంతో రోడ్డు వాడుక ఎక్కువ ఉండడంతో పనులు సక్రమంగా చేపట్టాలి. కానీ అలా చేయలేదు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో రోడ్డు పనులు చేపట్టాలి.

బిడ్డిక శ్రీనివాసరావు,
జెసిసి అధ్యక్షులు, సీతంపేట

ఎత్తు, పల్లాలు చదును చేయలేదు

ఈ రహదారి మరమ్మతులు చేపట్టినా ముందు రహదారి ఎత్తు, పల్లాలు చదును చేయకుండా దానిపైనే తారు రోడ్డు వేసుకొని వెళ్లిపోయారు. దీంతో రహదారి సమానంగా లేదు.

సవర మాసయ్య, మాజీ సర్పంచ్
వజ్జాయిగూడ.

మరమ్మతులు బాగానే చేపట్టాం

కుసిమి జంక్షన్ నుంచి శంభాం వరకు మరమ్మతులు రహదారి పనులు రూ.20 లక్షలతో స్టేట్ డిజస్ట్ ర్ మెడికేషన్ ఆర్ అండ్ బి నిధులు, రూ.20లక్షలతో బాగానే చేపట్టారు. మాన్యువల్‌తో పనులు చేశాం. నాలుగు మండలాలకు ఉన్నది ఒకరే జెఇ ఉన్నారు.

జగన్నాథరావు, డిఇ,
ఆర్ అండ్ బి పాలకొండ

గిరిజన విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరుకు చెందిన ఆరిక యగ్నిక్ ఆరేళ్ల గిరిజన విద్యార్థి అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన 8వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో యగ్నిక్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు యగ్నిక్‌ను మంగళవారం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ విశాఖలో జరిగిన పోటీల్లో భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక క్రీడాకారులతో పోటీపడి గోల్డ్ మెడల్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో మాస్టర్ కోచ్ తోట సింహాచలం, కోచ్ ఆరిక సింహాచలం పాల్గొన్నారు.


యాగ్నిక్‌ను అభినందిస్తున్న పిఒ

రెండో రోజు కొనసాగిన విచారణ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో రెండోరోజు మంగళవారం కూడా సిఆర్‌టిల విచారణ కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో సిఆర్‌టిల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయడానికి అప్పటి ఐటిడిఎ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, డిడి రుక్మాంగదయ్య లక్షల్లో ముడుపులు వసూలు చేశారనే ఆరోపణలు వినిపించాయి. గిరిజన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీనిలో భాగంగా మొత్తం 133 మంది సిఆర్టీల్లో సోమవారం సగం మందిని, మంగళవారం మిగిలిన వారిని ఎపిఒ మురళీధర్ విచారించారు. ఐటిడిఎతో సంబంధం లేని అధికారితో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గర్భిణుల ఆరోగ్యానికి బాధ్యత వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గర్భిణుల ఆరోగ్యం, సురక్షిత ప్రసవం మహిళా శిశు సంక్షేమ శాఖ బాధ్యత అని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి మహిళ గర్భిణిగా ఉన్నప్పటి నుంచే వారి ఆరోగ్యాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. రక్తహీనత పట్ల దృష్టి సారించాలన్నారు. రక్తహీనత నుంచి విముక్తి పొందడానికి అంగన్వాడీలదే 90 శాతం బాధ్యత అని ఆయన అన్నారు. ఆహారాన్ని సక్రమంగా అందించడం, వారిని పర్యవేక్షించడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని స్పష్టం చేశారు. ప్రతి గర్భిణీ మహిళ సురక్షిత ప్రసవం కావాలని, ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించాలని ఇందుకు మొదటి నుంచి స్పష్టమైన అవగాహన కల్పించడం, పౌష్టికాహార విలువలు తెలియజేయడం అవసరమని ఆదేశించారు. గర్భిణీ మహిళలు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ ఇవ్వడమే కాకుండా, అంగన్వాడీ కార్యక్రమాలు చక్కగా సాగాలని అన్నారు. ఆటలు, పాటల ద్వారా విద్యను నేర్పాలని, విద్య పట్ల ఆసక్తిని కల్పించాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ అంటే ఆహార పదార్థాలు పెట్టే ప్రదేశం గానే మిగలరాదని, ఆహ్లాదకరమైన సంపూర్ణ వికాస కేంద్రాలుగా గౌరవం సాధించాలని అన్నారు. ఫోర్టీ ఫైడ్ రైస్ తో వివిధ పౌష్టిక ఆహార పదార్థాలు తయారు చేయవచ్చని, గ్రామాల్లో సంబంధిత ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి అంగన్వాడి "సుపోషిత్" బహుమతులు అందుకోవాలని ఆకాంక్షించారు. "కిషోరీ వికాసం" కార్యాచరణ ప్రణాళిక పక్కాగా తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమం కింద ఏ ఒక్కరూ డ్రాప్ అవుట్‌గా బడి బయట ఉండరాదని, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించడం లేదా తమకు అవసరమగు రంగాల్లో శిక్షణ పొందడం, ఉద్యోగాలను పొందడం జరగాలని ఆయన స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు వీటి పర్యవేక్షణ చేపట్టి త్వరగా పనులు పూర్తి కావడానికి సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా. టి కనకదుర్గ, డిసిపిఒ ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మారు జాతరకు పోటెత్తిన యాత్రికులు

మధ్యాహ్నం దాటాక పెరిగిన భక్తుల తాకిడి
జాతరపై రథసప్తమి ప్రభావం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన జాతరగా మార్పు చెందిన పోలమాంబ అమ్మవారి జాతరకు భక్తులు పోటెత్తారు. మంగళవారం వనం, చదురు గుడుల వద్ద భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం రథసప్తమి కావడంతో మహిళా భక్తులు అధిక శాతం మధ్యాహ్నం 12గంటలు దాటాక అమ్మవారిని దర్శించుకోవడంతో ఆలయాలు కిటకిటలాడాయి. ఎప్పటి మాదిరిగానే దేవాదాయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. లడ్డూ ప్రసాదాలు అందుబాటులో ఉంచారు. సాలూరు సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రతిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. తొలుత వనం గుడి వద్ద దర్శించుకున్న భక్తులు గ్రామంలోని చదురు గుడి వద్దకు వచ్చి దర్శించుకున్నారు. వనం గుడి వెనుక భాగంలో ఉన్న వేపచెట్టుకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


అమ్మవారి దర్శననానికి బారులు తీరిన భక్తులు


రోడ్డు పనులపై అధికారులను ఆరా తీస్తున్న పిఒ శ్రీవాస్తవ

రోడ్డు నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దు

ప్రజాశక్తి - సీతానగరం/పార్వతీపురంరూరల్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో చేపట్టే సిసి, బిటి రోడ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దని ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మండలం హెచ్.కారాడవలసలో సిసి రోడు, సీతానగరం మండలం నిడగల్లు నుంచి జగన్నాథపురం వరకు వేస్తున్న బిటి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సీతానగరం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కార్యక్రమాల ప్రగతి గురించి సమీక్షించారు. ఐటిడిఎ పరిధిలో నిర్మించే రహదారి పనుల నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీపడరాదని, పక్కాగా నిర్మించాలని సూచించారు. జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించిన ఆయన అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో ఆహారం కలుషితం
20మంది విద్యార్థినులకు అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-విజయనగరం కోట, టౌన్

నగరంలోని సాంఘిక సంక్షేమ విద్యార్థినుల హాస్టల్ - 3లో సోమవారం భోజనం చేసిన 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వీరిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆహారం కలుషితం కావడమే ఇందుకు కారణమని విద్యార్థినులు అంటున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న ఐదుగురు విద్యార్థినుల్లో ముగ్గురు తిరుమల-మెడికవర్‌లోను, మరో ఇద్దరు జిల్లా కేంద్రాస్పత్రిలోను చికిత్స పొందుతున్నారు. ఈ హాస్టల్‌లో ఇంటర్, డిగ్రీ, నర్సింగ్ విద్యార్థులు ఉంటున్నారు. వీరికి ఆదివారం మధ్యాహ్నం హాస్టల్‌లో చికెన్, బిరియాని పెట్టారు. ఆరోజు రాత్రే ఆరుగురు విద్యార్థులకు విరేచనాలు కావడంతో ఆస్పత్రిలో చేరారు. మిగతా వారంతా ఒక్కొక్కరుగా అస్వస్థతకు గురవ్వంతో ఆస్పత్రికి తరలించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న రమ్య అనే విద్యార్థిని ఐసియులో చికిత్స పొందుతోంది. జనరల్ వార్డులో మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మిగతా వారంతా కోలుకొని హాస్టల్‌కు, తమ ఇళ్లకు వెళ్లిపోయారు. అస్వస్థతకు గురైన వారిలో అంపోలు అలేఖ (ఇంటర్), బంకపల్లి దీపిక (నర్సింగ్), జస్విని, సింధూ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు ఎస్ఎఫ్ఐ నాయకుల పరామర్శ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి రాము, సిహెచ్ వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకి పరామర్శించారు. ఈసందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో పరిస్థితి రాను రాను అగమ్య గోచరంగా తయారవుతుందని విమర్శించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, హాస్టల్ వార్డెన్‌ల నిర్లక్ష్యం వల్ల విద్యార్థినులను ప్రాణాపాయ స్థితికి తీసుకొచ్చిందని అన్నారు. ఇద్దరి పరిస్థితి క్షీణించడంతో జనరల్ వాటి నుంచి ఐసియులోకి మార్చారని తెలిపారు. తక్షణమే డిడి హాస్పిటల్లో ఉన్న విద్యార్థులను పరామర్శించి వారికి మెరుగైన సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇంతటి ఘోరానికి కారణమైన వార్డెన్ రాధామణిపై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలని సిహెచ్‌డబ్ల్యుల ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఉపాధి పనులైనా కల్పించండి లేదా నెలకు రూ.15 వేలు వేతనమైన ఇవ్వాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ నిరసనను ఉద్దేశించి సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు అనసూయమ్మ, రాధ, లక్ష్మి, దుర్గ మాట్లాడుతూ మండలంలోని కొమరాడ, మాదలింగి, రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 110 మంది వరకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పనిచేస్తున్నామని, తమకు కనీసం వేతనం ఇవ్వడంలేదన్నారు. నెలకు ఇస్తున్న రూ.4వేలు కూడా సక్రమంగా నెల నెలా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రతిరోజూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉదయం 9 గంటల నుండి రాత్రి వరకు పనిచేసే పరిస్థితి ఉందన్నారు. గ్రామాల్లో గర్భిణులకు, ఎవరికైనా ఏం జరిగినా పూర్తి బాధ్యత కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు అంటూ వీరిపై అధికారులు విరుచుకు పడే పరిస్థితి ఉందని తెలిపారు. పని భారం పెరిగిందని, ఉద్యోగ భద్రత లేదని, రాజకీయ వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో నెలకు కనీసం రూ.15వేలైనా ఇవ్వాలని, లేకుంటే ఉపాధి పనులైనా కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో అధిక సంఖ్యలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

ఎల్ఐసి ఉసురు తీస్తున్న కేంద్రం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జీవిత బీమా సంస్థలో (ఎల్ఐసి)లో 100శాతం విదేశీ పెట్టుబడులకు ఆహ్వానిస్తూ పార్లమెంట్లో బిల్లు ప్రవేశ పెట్టడం భారత జీవిత భీమా సంస్థ ఉసురు తీయడమేనని స్థానిక ఎల్ఐసి ఉద్యోగుల సంఘం బేస్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు టెక్కలి ధర్మారావు, ఆర్ వి ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ దేశంలో గల అన్ని ఎల్ఐసి కార్యాలయాల వద్ద మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉద్యోగులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 1995లో చేపట్టిన జీవిత బీమా సంస్థల్లోకి విదేశీ పెట్టుబడుల ఆహ్వానం దశలవారీగా 2024నాటికి వందశాతం చేరుకుందని అన్నారు. దీనివల్ల ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసి ఆఫ్ ఇండియాను తెరమరుగు చేయడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఏడాదికి వేలకోట్ల రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న ఈ సంస్థను పూర్తిగా కోలుకోలేని స్థితికి తీసుకురావడానికి ప్రయత్నిస్తే ఉద్యోగులు, సంఘాలు ఊరుకోవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునః సమీక్షించుకొని వెనుక్కు తీసుకోవాలని లేకపోతే దేశవ్యాప్త ఉద్యమాలు ప్రారంభమవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు ఆదిత్య, వెంకటరమణ, కోటేష్, సూర్య, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.


ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ నాయకులు ధర్మారావు, ప్రసాద్



స్టాకును పరిశీలిస్తున్న డిడి అన్నదొర

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిడి

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని ముత్యాలు ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ డిడి అన్నదొర మంగళవారం పరిశీలించారు. రికార్డులను, స్టాక్ రూంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల తరగతి గదులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా స్టోర్ రూమ్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎఎంఒ పి.కోటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు పరీక్ష చేయించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

కుష్టు వ్యాధి లక్షణాలైన స్పర్శ లేని మచ్చలు, రాగి, ఎరుపు రంగు మచ్చలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, చర్మంపై నూనె రాసినట్లు మెరుస్తూ కొంచెం దళసరిగా మారుతున్న మచ్చలు, చల్లని లేదా వేడి వస్తువులు స్పర్శ తెలియకపోవడం ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని మొండెంఖల్ పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ బి.ప్రజ్ఞ, డాక్టర్ హర్ష అన్నారు. మండలంలోని మొండెంఖల్ పిహెచ్‌సి నుంచి వారపు సంత మీదగా బస్టాండ్ వరకు కుష్టు వ్యాధిపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపిఎంఒ బలరాంనాయుడు, పారామెడికల్ సిబ్బంది, హెల్త్ సూపర్వైజర్లు, హెల్ప్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆలయ మండపం నిర్మాణానికి రూ.3.50లక్షలు విరాళం


ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మండల కేంద్రంలో నిర్మిస్తున్న పైడి మారమ్మ ఆలయ మండపం నిర్మాణానికి విశాఖపట్నంలో నివాసం ఉంటున్న కురుపాంకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రసాద్ లాల్, లక్ష్మీలాల్ దంపతులు రూ.3లక్షల 50వేలు మండల నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం విశాఖ వెళ్లి వారిని కలవగా ఈ విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గ్రామంలో ఆలయ మండప నిర్మాణానికి తమకు తోచిన సహాయం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. విరాళం ప్రకటించిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాసరావు, కోలా రంజిత్ కుమార్, బి.రామకృష్ణ, కె.ఉమ, ఎన్.వంశీ, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పెదబొండపల్లిలో ఈనెల 1న దళితులకు సంబంధించిన భూముల్లో కొంతమంది చేసిన ఆక్రమణలు గ్రామానికి చెందిన దళితులతో కలిసి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తొలగించిన సంఘటనలో పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సంతోషి కమారి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన చుక్క శ్రీదేవి పూర్వీకుల నుంచి తనకు దాఖలు పడిన భూమిలో ఎమ్మెల్యే కొంతమంది ఎస్సీలతో కలిసి తమ వ్యవసాయ క్షేత్రంలోకి ప్రవేశించి అక్కడ పరికరాలను ధ్వంసం చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన కందిమోహన్‌తో పాటు 24 మంది ఎస్సీలకు చెందిన వారు తమకు ప్రభుత్వం ఒక్కొక్కరికి ఎకరా చొప్పున ఇచ్చిన డి పట్టా భూముల్లో పెంచుకున్న మొక్కలకు కంచె కడదామని ప్రయత్నించగా శ్రీదేవి సాయికుమార్ అనే యువకుడితో కలిసి తమపై కులదూషణకు దిగుతూ దాడికి ప్రయత్నించారని ఆమెపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఇరువురు ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి, నివేదిక పై అధికారులకు పంపి విచారణ చేపడుతున్నట్లు రూరల్ ఎస్సై తెలియజేశారు.



ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

మూలగూడలో వరల్డ్ రీడ్ అలౌడ్ డే

ప్రజాశక్తి - భామిని

పిల్లలు ముందు బిగ్గరగా చదివి వినిపిస్తే, పిల్లలు చదువులో ఒక ఏడాది ముందుంటారని హోలీ క్రాస్ డైరెక్టర్ కె.ప్రభుదాస్ అన్నారు. మండలంలోని మూలగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలలో 15వ వరల్డ్ రీడ్ ఆలౌడ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బిగ్గరగా చదవడం, బొమ్మల ద్వారా కథలు చెప్పడం, కథలు చెప్పడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. అనంతరం జిగురు, కత్తెర అవసరం లేకుండా కిరీటాలు తయారీని వివరించి, పిల్లలచే కిరీటాలు తయారు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల భాషా వాలంటీర్ అడ్డయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని కొత్తపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపిడిఒ జి.పైడితల్లి పరిశీలించారు. వేతనదారులకు ప్రభుత్వం నిర్దేశించిన వేతనం గిట్టుబాటయ్యేలా సాంకేతిక సహాయకులు ముందస్తు కొలతలు ఇచ్చి వేతనదారులతో పనులు చేయించాలని సూచించారు. అనంతరం మస్తర్లను పరిశీలించారు. అధిక సంఖ్యలో వేతనదారులు పనుల్లో పాల్గొనేలా చర్యల చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. మండలం నుంచి రోజుకు కనీసం 5వేల నుంచి 7వేల మంది వరకు వేతనదారులు పనుల్లో పాల్గొనే ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు చేపట్టాలన్నారు. రెండుపూటలా పనులు చేపట్టాలన్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో నీడ ఉండేందుకు వీలుగా స్థానికుల సహకారంతో టెంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పరిశీలనలో ఎపిఒ ఎం.గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ పైడితల్లి

ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - మక్కువ

గ్రామాల్లో ఆరోగ్యపరమైన సమస్యలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ఆశాడే, శంబర జాతర వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆశాడేలో పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. మెరుగైన ఆరోగ్యం, రక్తహీనత నివారణకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన పెంపొందించాలని, తగు సూక్ష్మ పోషకాలు అవసరమని పేర్కొన్నారు. ఐరన్ లభించే ఆహారం ఎక్కువగా తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రం అందజేస్తున్న టిహెచ్ఆర్ గర్భిణీ, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత గా గుర్తించిన కిశోర బాలికల్లో హీమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలల్లో ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు లభ్యంగా ఉండాలన్నారు. ఈనెల 10 నుంచి నిర్వహించనున్న డీవార్మింగ్ కార్యక్రమానికి తగు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆశాలు, వైద్య సిబ్బంది ఆరోగ్య సర్వేలు పూర్తి స్థాయిలో నిర్వహించి సకాలంలో వ్యాధులను గుర్తించాలన్నారు. వాటర్, వెక్టార్ బోర్న్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. తాగు నీటి స్వచ్ఛత పరీక్షలు గ్రామాల్లో నిర్వహించాలన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అక్కడ చేపట్టిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ ముందస్తుగా చేయాలని, తద్వారా వ్యాధి ముప్పు తప్పుతుందని తెలిపారు. కేన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచి, వైద్య శాఖ నిర్దేశించిన పరీక్షలు నిర్వహించి సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ శంబర జాతర సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని క్యూలైన్ వద్ద పరిశీలించారు. శిబిరాన్ని వినియోగించుకుంటున్న భక్తులు వారి ఆరోగ్య పరమైన సమస్యలు అందజేసిన చికిత్సా వివరాలు పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మందులు, వైద్య పరీక్షలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.హరికృష్ణ, డాక్టర్ ఎన్.కిరణ్ కుమార్, డాక్టర్ నిఖిల, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, సిహెచ్ఒ నిర్మల, సూపర్వైజర్లు రత్నం, జయగౌడ్ వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జగన్మోహనరావు

సస్పెండైన ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయ సహాయం

ప్రజాశక్తి - సాలూరు

మన్యం జిల్లాలో గానీ, సాలూరు నియోజకవర్గంలో గానీ రాజకీయ కారణాల చేత సస్పెండైన ఫీల్డ్ అసిస్టెంట్లకు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు న్యాయవాది రేగు మహేష్ చెప్పారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ చట్టం నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అభివృద్ధి పనులపై మండలంలోని మూడు పంచాయతీల సర్పంచులు హైకోర్టులో వేసిన కేసులో కోర్టు స్టే విధించిందని చెప్పారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర సలహా మేరకు ఆ ముగ్గురు సర్పంచులతో తాను హైకోర్టులో కేసు వేయించానని, తీర్పు సానుకూలంగా వచ్చిందని చెప్పారు. వెండర్ ముసుగులో నచ్చిన వ్యక్తులకు ఉపాధి పనులు అప్పగించడమనేది చట్టంలో ఎక్కడా లేదన్నారు. ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు తీర్పు సానుకూలంగా వచ్చినందున, ఇంకెవరైనా తనను సంప్రదిస్తే తగిన న్యాయ సహాయం చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేసి రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సస్పెండ్ చేయడం, తొలగించడం వంటి చర్యలు టిడిపి ప్రభుత్వ హయాంలో ఎక్కువగా జరిగాయని చెప్పారు. ఇలాంటి చిరుద్యోగులైన ఫీల్డ్ అసిస్టెంట్ల విషయంలో మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర వారికి అందిజేస్తున్న సహకారం అభినందనీయమని చెప్పారు. అదేవిధంగా జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు గాని, మాజీ మంత్రులు గానీ సస్పెండైన ఫీల్డ్ అసిస్టెంట్ల విషయంలో న్యాయ సహాయం కోరితే అందించడానికి సిద్ధంగా వున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ చట్టం కింద జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు చట్టానికి పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. జిల్లాలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లను కూడా అధికారపార్టీ నాయకుల ఒత్తిడి మేరకు జిల్లా అధికారులు తొలగిస్తున్నారని చెప్పారు. టిడిపి నాయకులు, జిల్లా అధికారులు కుమ్మక్కై భారత రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. అయితే తాను మాత్రం రాజ్యాంగానికి లోబడి ఉద్యోగులు, బాధిత ప్రజల తరపున న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నానని మహేష్ చెప్పారు.



ప్రదర్శన చేస్తున్న పిఎంపి, పిహెచ్‌సిపిలు

ప్లాస్టిక్‌ను నివారిద్దాం...కేన్సర్‌ను తరిమేద్దాం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్లాస్టిక్‌ను వాడడం వల్లే కేన్సర్ బారిన పడాల్సి వస్తుందని, కావున ప్లాస్టిక్‌ను నివారించి ఆ వ్యాధిని జయిద్దామని ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ పార్వతీపురం, విజయనగరం అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో కేన్సర్ నివారణకై అవగాహన ర్యాలీని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి పనికి ప్రజలు ప్లాస్టిక్ కవర్లను వాడడం అలవాటుగా మారిపోయిందన్నారు. దీని కారణంగానే మనం కేన్సర్ బారినపడాల్సి వస్తుందన్నారు. ప్రధానంగా ఆహార పదార్థాలకు కవర్లు ఉపయోగించడం వల్ల, ప్లాస్టిక్ తగలబెట్టడం వల్ల కాలుష్య కారకవాయువులు వెలువడుతాయన్నారు. ప్రధానంగా కేన్సర్, గుండె జబ్బులు, జీర్ణాశయం, పేగు వ్యాధులు, ఊపిరితిత్తులు, నరాల బలహీనత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తడానికి ప్రధాన కారణం కేన్సర్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల గొంతు కేన్సర్, థైరాయిడ్, రొమ్ము, ఊపిరితిత్తులు, లివర్, గర్భాశయానికి సంబంధించిన కేన్సర్ వ్యాధులు వస్తాయన్నారు. కావున ప్రజలు కేన్సర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, కేన్సర్ కారకాలైన ధూమపానం, మద్యపానం, ప్లాస్టిక్ వాడకాలను అరికట్టి వారి ఆరోగ్యాన్ని కేన్సర్ బారిన పడకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం, కార్యదర్శి నడిమింటి గోపాలనాయుడు, ఉపాధ్యక్షులు వానపల్లి శంకరరావు, సహాయ కార్యదర్శి బివి నాయుడు, ట్రెజరర్ బి.తులసీదాస్, జిల్లాలోని పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ఫేర్‌వెల్‌డే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటలో గల అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ఫెయిర్‌వెల్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మధుబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు స్నేహభావం కలిగి ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులు చదువుతూ ఉన్నత ఆశయంగా లక్ష్యాన్ని చేరుకున్న దిశగా ఉండాలన్నారు. విద్యార్థుల ఆత్మీయ కలయిక విద్యార్థి దశలోనే ఉంటుందని దీన్ని వివిధ రంగాల్లో ఉన్నప్పటికీ ఆ స్మృతులను మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.ఈశ్వరరావు, రాజు, ప్రసాదుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

పిఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకం ప్రవేశపెట్టిన పిఎం సూర్యఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గృహనిర్మాణ లబ్ధిదారులు తక్షణమే ఇళ్లు నిర్మించుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పిఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకొనేందుకు లబ్దిదారుల రిజిస్ట్రేషన్ చేయించే వివరాలను విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ పాపరావు వివరించారు. గ్రామంలో 350 యూనిట్ దాటిన జాబితాను ఎంపిడిఒ కార్యదర్శులకు ఇస్తూ లక్ష్యాలను ఈనెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ వినియోగదారుల సర్వే డేటాలోని తప్పిపోయిన వారి డేటాను త్వరితగతిని పూర్తి చేయాలని సూచించారు. ఉపాధిహామీ ద్వారా జరుగుతున్నా పనులపై సమీక్షించారు. జిపిడిపి ప్లాన్ తయారు చేసుకుని పిఆర్‌లైన్ యాప్ ద్వారా అప్లోడ్ చేయాలని, ఈనెల 15 నాటికి ఇంటిపన్నులు వసూలు పూర్తి కావాలని ఇఒపిఆర్‌డికి సూచించారు. ఈనెల మూడో శనివారం స్వచ్ఛ దివస్‌లో చేపట్టాల్సిన పనులను వివరిస్తూ గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో పలుశాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతలతో బెంబేలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ ఏడాది వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉంటాయనేందుకు నిదర్శనం ఎక్కువగా కనబడుతుంది. ఫిబ్రవరి ప్రారంభంలోనే ఎండలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో మంగళవారం భానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో జనం బెంబేలెత్తారు. ఎండ వేడిమితో పాటు, అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా పట్టణ ప్రధాన రహదారి జనసంచారం లేక బోసిపోయింది. ఫిబ్రవరిలోనే ఎండలు ఇలా ఉంటే రానున్న మార్చి, ఏప్రిల్, మేలో ఉష్ణోగ్రతలు ఏ విధంగా ఉంటాయని ప్రజలు ఇప్పటి నుంచే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ షణ్ముఖరావు

పంటల మార్పిడితో అనేక లాభాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ రకాల పంటలతోనే అనేక లాభాలు రైతులు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని నాగూరులో కేతిరెడ్డి వెంకటనాయుడు పొలంలో సాగు చేస్తున్న పలు పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఏక పంట వేయడం వల్ల దిగుబడులు, భూసారం తగ్గి రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఈ తరుణంలో వరి పంట తర్వాత రబీ డ్రై సోయింగ్‌లో భాగంగా మినుముతో పాటు మొక్క జొన్న, కంది, బొబ్బర్లు, పెసలు, ఉలవలు సాగు చేయాలన్నారు. వీటివల్ల పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. మిగతా పంటలకు కూడా అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. భూమి సారవంతం చెందడం, మొక్కల్లో జీవ వైవిధ్యం పెంపొందించడం, పురుగులు – తెగుళ్ల తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని తెలిపారు. ఒక పంట తర్వాత మరో పంట రావడం జరుగుతుందని, ఏడాది పొడవునా పంటలు భూమిపై పండించడం వల్ల సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని, నిత్య పంటలు – నిత్య ఆదాయం లభించడంతో పాటు, పలు పంటల వల్ల రైతులకు, ప్రకృతికి పలు లాభాలు సంభవిస్తాయని తెలిపారు. అలాగే నువ్వులు వేసుకొనే రైతులు మూడు మీటర్లకు, ఒక వరుస చొప్పున కంది, లేదా బెండ, జొన్న , సజ్జ వేసుకొంటే మంచి ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ, మండల ఇన్చార్జి వి.పోలినాయుడు, వెంకటనాయుడు, గౌరునాయుడు, రైతులు జి.లక్ష్మి, జి.సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

రథసప్తమిని పురస్కరించుకొని పట్టణ శివారులో గల సూర్యపీఠంలో ఆ పీఠం నిర్వాహకులు వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో మంగళవారం రథసప్తమి వేడుకలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర సూర్య పీఠానికి చేరుకుని స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యపేఠం నిర్వాహకులు శాస్త్రోక్తంగా పూజలు, స్వామివారి కళ్యాణం నిర్వహించి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. జీవకోటి మనుగడలో సూర్యుడి పాత్ర ఎనలేనిదని, సూర్య భగవానున్ని దర్శించుకోవడం అదృష్టమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్య పీఠం నివాహకులు వేమకోటి వివేకానంద శర్మ, పౌరోహితులు, టిడిపి నాయకులు బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, గుండ్రెడ్డి రవికుమార్, కోలా మధు, తదితరులు పాల్గొన్నారు.



రథసప్తమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురంలో గల సూర్య దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఆలయ నిర్వహకులు బడి శ్రీరాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు అభిషేకాలకు పరిసర గ్రామాల నుండి ప్రజలు పాల్గొన్నారు.

పాచిపెంట : రథసప్తమిని పురస్కరించుకొని పాచిపెంటలోని నాయుడు వీధిలో మంగళవారం ప్రత్యేక పూజలు మహిళలు నిర్వహించారు. జీవకోటి మనుగడలో సూర్యుని పాత్ర ఎనలేనిదని, రథసప్తమి నాడు సూర్యునికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకోవడం అనవాయితీగా వస్తుందన్నారు.

28న ప్రజ్ఞా వికాస పరీక్ష : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కురుపాం

ఫిబ్రవరి 8న జరిగే ప్రజ్ఞా వికాసం పరీక్షకు పదో తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ కురుపాం మండల బాధ్యులు ఆరిక గంగారావు పిలుపునిచ్చారు. మండలంలోని మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రజ్ఞ వికాస్ పరీక్షపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పదో తరగతి పబ్లిక్ పరీక్షల ముందు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల పదో తరగతి విద్యార్థులకు ఒత్తిడి తగ్గుతూ ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. పబ్లిక్ పరీక్షలపై ఒక మంచి అవగాహన వస్తుందని విద్యార్థులకు ప్రోత్సాహంగా బహుమతులు కూడా ఉంటాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొదటి బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతికి రూ.3వేలు, తృతీయ బహుమతి కింద రూ. 2వేలు నగదు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే మండలాల వారీగా మెమోంటోలు కూడా ఇస్తామన్నారు. కావున విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు గంగారావు

ప్రభుత్వ భూముల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చల్లంనాయుడువలసలో పేదల ఇళ్లస్థలాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని స్థానిక తహశీల్దార్ కె.ప్రశాంత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా మంజూరైన పంచాయతీ కార్యాలయం కోసం స్థల సేకరణలో భాగంగా భూమిని పరిశీలించినట్లు తెలిపారు. ఎవరైనా ఈ భూమిని ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, విఆర్ఒ సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేప పిల్లల పెంపకంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

చేప పిల్లల పెంపకంపై మత్స్యకారులు దృష్టి సారించాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వై.శ్రీదేవి అన్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువుల్లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మత్స్యకారులకు రాయితీపై సరఫరా చేసిన 1,33,420 చేప పిల్లలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ షిరిడి సాయి స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేప పిల్లలను సొసైటీ సభ్యులకు రాయితీపై సరఫరా చేస్తుందన్నారు. మండలంలోని గరుగుబిల్లి ఉద్దవోలు, దళాయివలస, పెద గుడబ, సన్యాసిరాజుపేట, తదితర గ్రామాల్లోని చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ దాసరి లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు చింతల వెంకట కూర్మినాయుడు, తిరుపతి, భాస్కరరావు, నారంశెట్టి కీర్తి, నవీన్ కుమార్, గ్రామ మత్స్యసహాయకులు పి.ప్రదీప్ కుమార్, నందివాడ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మొదట ప్రాధాన్యత ఓటువేసి గెలిపించండి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్, మండల కమిటీ అధ్యక్షుడు మద్దిల సత్యనారాయణ తదితరులతో కలిసి నెల్లిమర్ల పట్టణంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రజా వ్యతిరేక సంస్కరణలు, విధానాలను ఎదురించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న తనకు అన్ని సంఘాల ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సి కమిటీ వేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై ఆన్‌లైన్ యాప్‌ల భారంతో విద్యాబోధనకు తీవ్రమైన ఆటంకం ఏర్పడుతుందన్నారు. వారిని బోధనకే పరిమితం చేయాలని కోరారు. అందరికీ కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని చెప్పారు. సిపిఎస్, 117 జీఓ రద్దు తదితర సమస్యలను తమ మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు విజయగౌరి పేర్కొన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 9 నుంచి పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిలెంక సన్యాసి నాయుడు, సహాధ్యక్షులు వంగపండు సురేష్ బాబు పాల్గొన్నారు.